క్లుప్తంగా

నేడు మినీ జాబ్‌మేళా

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి బొమ్మూరులోని కలెక్టరేట్ భవనంలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్)లో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఐఐఎఫ్ఎల్, ఈకామ్ ఎక్స్‌ప్రెస్, డీమార్ట్ ఇండియా లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ సంస్థల్లో పనిచేయుటకు టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన 19 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 98487 29819, 95818 10049 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

బాధితురాలికి చందన నాగేశ్వర్ పరామర్శ


ఆస్పత్రిలో శ్రావణిని పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ఉన్మాది దాడిలో గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణిని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ గురువారం పరామర్శించారు. ఘటన వివరాలను తెలుసుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, గిరి, పుచ్చా ప్రసన్న కుమార్ రెడ్డి ఉన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కడియం: స్థానిక మండల పరిషత్ సాధారణ సమావేశం శనివారం జరుగుతుందని ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కడియం: స్థానిక బేకరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మన్ని శ్రావణి అనే మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. బాధితురాలికి మద్దతుగా గురువారం గ్రామస్తులు, హైస్కూలు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం.సుజాతకు వినతి పత్రం అందించారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఓపెన్ చాంపియన్ షిప్ 2023 పోటీలు గురువారం స్థానిక మల్లయ్యపేట రిక్రియేషన్ క్లబ్‌లో ఉత్సాహంగా జరిగాయి. బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎస్.శ్రీలక్ష్మి మొదటి, లక్ష్మీ సంధ్య రెండు, భవాని మూడో స్థానంలో నిలిచారు. అండర్ 8, 10, 12 విభాగాల్లో జయదీప్, కీర్తన, హర్షల్ బంగారు పతకాలు, అభిషేక్, అయేషా వెండి పతకాలు సాధించారు. విజేతలను కరాటే మాస్టార్లు పిల్లి అరుణ్ కుమార్, విజయ్, బూడిద సాయి, సుమన్ అభినందించారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షానికి రోడ్లపై పేరుకు పోయిన వ్యర్థాలు, బురదను తొలగించేందుకు అత్యవసర చర్యలు చేపట్టినట్లు నగరపాలకసంస్థ శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో బురద పేరుకు పోయిందన్నారు. ముఖ్యంగా హైటెక్ బస్టాండ్ వద్ద ప్రత్యేక వాహనం ద్వారా పేరుకు పోయిన బురదను తొలగించే చర్యలు చేపట్టామన్నారు.

బదిలీలు నిలిపివేయాలని వినతి

కంబాలచెరువు: ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించాలని, అక్రమ బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ బదిలీలు జరిగి నెల రోజులు గడిచినా, ఇంతవరకు పాఠశాల విద్యాశాఖ కేడర్ స్ట్రెంత్ నిర్ధారించలేదన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, కోశాధికారి ఈవీఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శులు పి.రమేష్ బాబు, ఎస్.రవిబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కంబాలచెరువు: విద్యుదాఘాతంతో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సుశిత్ కుమార్ (35) మృతి చెందాడు. నగరంలో పెయింటింగ్ పనులకు వచ్చిన సుశిత్ కుమార్ గురువారం మధ్యాహ్నం ఇన్నీసుపేటలోని బైపాస్ రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో షాక్ కొట్టి పడిపోయాడు. వెంటనే స్థానికులు 108లో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముంపునీటిలో కారు


కంబాలచెరువు వద్ద వివేకానంద సెంటర్‌లో నీరు

జలమహేంద్రి..

- దంచికొట్టిన వాన
- చెరువులా మారిన నగరం


కంబాలచెరువు సమీపంలోని హైటెక్ బస్టాండ్ వద్ద నీటమునిగిన రహదారి

సీటీఆర్ఐ: వరుణుడు గురువారం తన ప్రతాపాన్ని చూపించాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆగకుండా, విడవకుండా కురిసిన వానకు నగరం చెరువులా మారింది. పలు సెంటర్లు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు, పాదచారులు చాలా అవస్థలు పడ్డారు. కంబాల చెరువు హైటెక్ బస్టాండ్‌లోకి నీరు చేరింది. ఆ రోడ్డుపై రాకపోకలు ఇబ్బందులు ఎదురయ్యాయి. క్వారీ మార్కెట్ సెంటర్, ఆనంద్ నగర్, ఆర్యాపురం, తుమ్మలావ, సువిశేషపురం, లాలాచెరువు, దానవాయిపేట, తిలక్ రోడ్డు, తాడితోట, వై.జంక్షన్, స్వతంత్ర హాస్పిటల్ ప్రాంతం, వేంకటేశ్వర నగర్, సీతంపేట ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.

రాజమహేంద్రవరం రూరల్: రైల్వేస్టేషన్ రోడ్డు, శ్యామలా సెంటర్, ఇన్నీసుపేట వీటీటీ కళాశాల సమీపంలోని దుర్గాలమ్మ ఆలయం వద్ద రోడ్లు జలమయమయ్యాయి.


ఇన్నీసుపేట దుర్గాలమ్మ ఆలయం వద్ద నీటమునిగిన రోడ్డు


చెరువులా మారిన రైల్వే స్టేషన్ రోడ్డులో వాహనాల రాకపోకలు


రామచంద్రరావు పేటలో ఇంటిలోకి వచ్చిన నీటిని తోడుతున్న మహిళ

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి


ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డ్ జిల్లా చైర్మన్ ఆరిఫ్

సీటీఆర్ఐ: ముస్లింల సమస్యలు తెలుసుకుని, వాటిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నామని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. ఆయన గురువారం స్థానికంగా పలు మసీదులను సందర్శించి ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతనాలు అందుతున్న తీరును పరిశీలించారు. షాదీఖానాలు, ఖబరిస్థాన్ ప్రహరీలు, ధార్మిక కేంద్రాల మరమ్మతులకు సంబంధించి ఎంతో కాలంగా ఉన్న డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఉర్దూను ప్రభుత్వం రెండో అధికారిక భాషగా గుర్తించిందన్నారు. కేవలం ధార్మికపరమైనవే కాక ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు ఉన్నా, అర్హత ఉండి పథకాలను అందుకోలేకపోతున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ అందజేస్తున్న పథకాల ద్వారా ముస్లిం సమాజం ఎంతో లాభపడుతోందన్నారు. వాటిని ఉపయోగించుకుని విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ జిల్లా డైరెక్టర్లు షబ్బర్ బాషా, మహ్మద్ జఫరుల్లాఖాన్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి


ముంపు ప్రాంతాల పరిస్థితిని తెలుసుకుంటున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలకు నగరంలోని ముంపునకు గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కురిసిన వర్షానికి నీటమునిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం తన కార్యాలయంలో ఇంజినీరింగ్, పారిశుధ్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. గోదావరికి వెళ్లే అన్ని దారులు, పంపింగ్ స్టేషన్ల వద్ద నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అదనపు కమిషనర్ సత్యవేణి, ఎస్ఈ పాండురంగారావు, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

కంబాలచెరువు: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 కేజీల గంజాయిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఆల్‌కట్‌గార్డెన్స్ సమీపంలోని రైల్వే క్వార్టర్స్ వద్ద కొందరు గంజాయి ఉందనే సమాచారంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. బొమ్మూరు సుద్దగనికి చెందిన ఐ.చిరంజీవి, టి.భాస్కరరావు, మరో ముగ్గురు మైనర్లను పట్టుకున్నారు. కోర్టుకు తరలించి రిమాండ్ నిమిత్తం జైలుకి పంపారు.

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ఆవరోడ్ లారీస్టాండ్ సమీపంలో ఒడిశాకు చెందిన లారీలో 2.15 కిలోల గంజాయిని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు స్వాధీనం చేసుకున్నారు. బిహార్ చెందిన లారీడ్రైవర్ శుభాష్‌షాను అరెస్టు చేశారు. విశాఖ నుంచి వచ్చే దారిలో గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిసిందని, తమకు అందిన సమాచారం మేరకు లారీని సోదా చేయగా గంజాయి దొరికిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోస్టల్ బీమాను వినియోగించుకోవాలి


బీమా నమూనా చెక్కు అందజేస్తున్న కోమల్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ తపాలా శాఖ ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఎస్పీ కోమల్ కుమార్ తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ ఏడాదికి రూ.399 ప్రీమియంతో రూ. పది లక్షల బీమా పాలసీని ప్రజలకు అందజేస్తోందన్నారు. పాలసీ తీసుకున్న ఫ్లెక్సీ యూనియన్‌కి సంబంధించిన ఒక వ్యక్తి మరణించడంతో ఆయన నామినీకి రూ.పది లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఐపీపీబీ సర్కిల్ హెడ్ ప్రకాష్, రీజినల్ హెడ్ గంగాధర్, బ్రాంచ్ హెడ్ సీహెచ్ వంశీకృష్ణ, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, హెడ్ పోస్ట్ మాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

15న బహిరంగ వేలం

అనపర్తి: అనపర్తి గ్రామ పంచాయతీ మార్కెట్ ఏరియాలో నూతనంగా నిర్మించిన నాలుగు దుకాణ సముదాయాల్లోని 32 షాపులను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈ నెల 15వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి తెలిపారు. స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో సర్పంచ్ వారా కుమారి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించి లాటరీ తీశారు. జ్యోతీరావ్‌పూలే కాంప్లెక్స్‌లో 6, 7 నెంబర్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 8వ నెంబర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాంప్లెక్స్‌లో 1వ నెంబర్, డాక్టర్ వైఎస్సార్ కాంప్లెక్స్‌లో 1వ నెంబర్ షాపులు లాటరీలో వచ్చాయన్నారు.ఐదు షాపుల్ని షెడ్యూల్ కులాలకు, మిగిలిన 27 షాపులు ఓపెన్ కేటగిరీలోనూ బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముంపు సమయంలో హుకుంపేటలో పాల ప్యాకెట్లు అందజేస్తున్న వలంటీర్ అముజూరి ఆదిత్య వెంకట్

ముంపు సమయంలో విస్తృత సేవలు

గోదావరి ఉధృతి కారణంగా గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో హుకుంపేట పంచాయతీ పరిధిలోని సావిత్రీ నగర్, మూడు గుళ్ల వీధి, రామకృష్ణ నగర్‌లోని పలు వీధులు జలమయమయ్యాయి. ఆ సమయంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ ఎక్కువ శాతం అపార్టుమెంటు వాసులే. మోకాళ్లలోతు నీటిలో బయటకు వచ్చేందుకు మార్గం లేదు. ఆ సమయంలో పంచాయతీ అధికారులు పడవను ఏర్పాటు చేశారు. దానిపై వలంటీర్లు తిరుగుతూ ప్రజలకు పాల ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులను అందించారు. తమ పరిధిలోని ఇళ్లకు సంబంధిత వలంటీర్లు సేవలు చేశారు. – రాజమహేంద్రవరం రూరల్

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం. హుకుంపేట ముంపు సమయంలో వలంటీర్లు అందించిన సేవలు వెలకట్టలేనివి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించారు. ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. వారి వల్లనే అన్ని పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు అందుతున్నారు. వలంటీర్లు ప్రతి కుటుంబంలో సభ్యులుగా మారిపోయారు.

– ర్యాలి వెంకట భాస్కర సత్యనారాయణ, హుకుంపేట

రైస్ కార్డు మంజూరైంది


గ్రంధి రమణమ్మ, మీరా దంపతులకు రైస్‌కార్డు అందిస్తున్న వలంటీర్ నిహారిక

బొమ్మూరు వెంకటగిరికొండ ప్రాంతానికి చెందిన గ్రంధి రమణమ్మ, మీరా దంపతులకు 4 వీలర్ వ్యాన్ ఉందంటూ (వాస్తవానికి లేదు) గత ప్రభుత్వం రేషన్ కార్డు మంజూరు చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థ వచ్చింది. దీంతో వలంటీర్ నిహారిక గ్రంధి రవణమ్మకు రేషన్ కార్డు లేదన్న విషయాన్ని తెలుసుకుంది.వ్యాన్ లేనప్పటికీ రేషన్‌కార్డు రాకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో కొద్ది రోజుల్లోనే రైస్‌కార్డు మంజూరు చేయించి, వారికి అందజేసింది. రైస్‌కార్డు రావడంతో గ్రంధి రవణమ్మకు కాపు నేస్తం పథకం వర్తించింది. గ్రంధి మీరాకు పింఛన్ మంజూరైంది. – రాజమహేంద్రవరం రూరల్

సేవలు అభినందనీయం

వలంటీర్ నిహారిక సేవలు అభినందనీయం. మాకు రేషన్ కార్డు లేదన్న విషయం తెలుసుకుని మాకు రైస్ కార్డు ఇప్పించింది. కార్డు కావడంతో పథకాలు వర్తిస్తున్నాయి. నా భర్తకు పింఛన్ కూడా మంజూరైంది.

– గ్రంధి రవణమ్మ, బొమ్మూరు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుపై సమీక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్ఐ: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలు తీరుపై ఇంతవరకూ ఒక్కసారి కూడా సమీక్ష జరగకపోవడం విచారకరమని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013 జనవరి 24 నుంచి ఇప్పటివరకు దశాబ్దకాలం పాటు ఈ చట్టం అమలు తీరును సమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో జీవో ఆర్‌టీనెం 91 విడుదల చేసిందన్నారు. దీనిపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించేందుకు ఒక రెండు నెలలు మాత్రమే సమయం ఉన్నందున చట్టం పటిష్ట అమలుకు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజనశాఖ మంత్రి పి.రాజన్నదొర అధ్యక్షుడిగా 19 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఏర్పడిన ఈ కమిటీ చట్టం అమలు తీరును సమీక్షించి, విజయవంతంగా అమలు చేసేందుకు తగిన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ నాయకులు అరగంటి వీరభద్రారెడ్డి, యలగాడ నాగేశ్వరరావు, న్యాయవాది చిలకపాటి వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్రైడల్ మేకప్ కాంపిటేషన్


విజేతలకు బహుమతులు అందేస్తున్న షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక జేఎన్ రోడ్డులోని ఫంక్షన్ హాల్లో గురువారం మేకోవర్ బ్రైడల్ మేకప్ కాంపిటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని బ్యూటీషియన్లను ఒక వేదికపైకి తీసుకువచ్చి ఈ కార్యక్రమం నిర్వహించడంపై అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, బ్యూటీ కేర్ రమ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పేపరు ప్రతుల దహనం

రాజానగరం: స్థానిక గ్రంథాలయం వద్ద మండలంలోని బుక్ డిపాజిట్ సెంటర్ల (బీడీసీ) నిర్వాహకులు గురువారం ఆంధ్రజ్యోతి పేపరు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న తమపై ఆంధ్రజ్యోతి పత్రిక ఉమ్మడి కృష్ణాజిల్లా ఎడిషన్‌లో 'బుక్ పేరిట బొక్కేస్తున్నారు' అనే శీర్షికతో వార్తను ప్రచురించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తప్పుడు రాతలతో ఉనికి కోసం ప్రాకులాడుతున్నారంటూ ఆ పత్రికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవ వేతనం రూ.మూడు వేలు, పుస్తకాలు, పేపర్ల కోసం రూ.వెయ్యి చొప్పున గ్రంథాలయ సంస్థ చెల్లిస్తోందన్నారు. దీనిలో బొక్కేయడానికి ఏముందో ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ వివరించాలని డిమాండ్ చేశారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు


పెడింగొయ్యిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి జ్యోతి


పొట్టిలంకలో పత్రాలు అందజేస్తున్న శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర


34వ డివిజన్‌లో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

- జిల్లా గిరిజన సంక్షేమాధికారి జ్యోతి
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల అందజేత

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి అన్నారు. పిడింగొయ్యి గ్రామసచివాలయం–1లో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్లను 1,552 మందికి కేఎన్ జ్యోతి, మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్, సచివాలయ కన్వీనర్లు చేతుల మీదుగా అందజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తమకు మేలు జరిగిందని పలువురు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్, వైఎస్సార్ సీపీ నాయకులు బొప్పన సుబ్బారావు, తీగిరెడ్డి శ్రీనివాస్, పల్లేటి చిన్నబాబు, పడాల వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

- శాటిలైట్‌సిటీ సచివాలయం–3లో తహసీల్దార్ పైడి చిన్నారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. వివిధ రకాల 1,568 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు సచివాలయ కన్వీనర్లు బత్తిన అప్పారావు, రుంకాని రమణమ్మ, పుచ్చా గోవిందరెడ్డి అందించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్అండ్ఆర్డీ టి.కృష్ణ పాల్గొన్నారు.
- కాతేరు సచివాలయం3లో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, సచివాలయ కన్వీనర్లు నక్కా ధనరాజు, రొంగలి వెంకటేశ్వరరావు, చీకట్ల రంజిత్ చేతుల మీదుగా లబ్ధిదారులకు 1,514 సర్టిఫికెట్లు అందజేశారు. మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ చైర్మన్ ఆచంట కల్యాణ్, పార్టీ నాయకులు యెజ్జు వాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

కడియం: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖాధికారి కె.రాధాకృష్ణ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం వీరవరం 2 పరిధిలో 7,44 ధ్రువీకరణ పత్రాలు, పొట్టిలంక 2 సచివాలయం పరిధిలో 834 పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అలాగే ఉత్తమ సేవలందించిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ నాయకులు బత్తుల రాము, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, తహసీల్దార్ ఎం.సుజాత, ఎంపీడీవో కె.రత్నకుమారి, ఈవోపీఆర్డీ వీవీఎస్ లక్ష్మి, ఏవో చంద్రరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరంలోని మూడు ప్రాంతాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించామని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి తెలిపారు. నగరంలోని 24, 30, 33, 34 డివిజన్లలో నిర్వహించిన గ్రామసభల్లో 53, 56, 54, 55, 59, 60, 96 సచివాలయాలకు చెందిన వారికి 5,940 ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. శుక్రవారం నగరంలోని 32, 33, 35, 36, 39, 40 డివిజన్లలో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లాలో చురుకుగా ఎల్‌సీడీసీ సర్వే

రాజానగరం: క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా జిల్లాలో ఇంటింటా లెప్రసీ కేస్ డిటెక్షన్ కాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సర్వే జరుగుతోందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వసుంధర అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆమె రోగులకు పంపిణీ చేస్తున్న మందులు, ఉన్న సదుపాయాలతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వ్యాధి అనుమానిత లక్షణాలు ముఖ్యంగా శరీరంపై ఉండే మచ్చలను ఈ సర్వేలో ఆశ వర్కర్లు, వలంటర్లు గుర్తిస్తున్నారన్నారు. అనుమానితులను దగ్గరలోని పీహెచ్‌సీలకు పంపిస్తున్నారని, అక్కడ ఉన్న వైద్యులు పరీక్షించి, తదనుగుణంగా వైద్యం అందిస్తారన్నారు. రాజానగరం మండలంలో ఇంతవరకు 22 గ్రామ సచివాలయాల పరిధిలో 58,057 మందిని ఇంటింటికీ వెళ్లి పరీక్షించి, 1,736 మందికి మచ్చలున్నట్టు గుర్తించారన్నారు. అయితే ఆ మచ్చలు క్షయవ్యాధికి సంబంధించినవి కావని, చర్మవ్యాధులకు సంబంధించినవిగా పీహెచ్‌సీలో వైద్యులు స్పష్టం చేశారన్నారు. ఇదే విధంగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో సర్వే, అనంతరం వైద్య పరీక్షలు జరిపి, వ్యాధి నిర్ధారణ చేస్తారన్నారు. ఈ సర్వే ఈనెల 27లోగా పూర్తవుతుందన్నారు.